సాక్షి
మంచిర్యాల
సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



నేషనల్ రేస్‌లో శ్రీనివాస్ బోధన వీడియో

విద్యా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుంచి టాప్ 5 వీడియోలు ఎంపిక చేశారు. ఇన్నోవేటివ్ టీచింగ్ పెడగాగి విభాగంలో నెన్నెల మండలం నార్వాయిపేట్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పంపిన వీడియో ఎంపికైంది. 8లో▸



అదరగొట్టిన బాడీబిల్డర్స్ 10లో▸

బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించారు. స్కై జిమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఓటీలను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రారంభించారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /19.5

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత అధికమౌతుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి పదోతరగతి (సీబీఎస్ఈ) పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి(సీబీఎస్ఈ) పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 131 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కార్మెల్ హైస్కూల్‌కు చెందిన 70 మంది విద్యార్థులు, ఉషోదయ హైస్కూల్‌కు చెందిన 31 మంది, కేంద్రీయ విద్యాలయానికి చెందిన 31 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నంది అవార్డు అందుకున్న చిన్నారులు



అవార్డులు, ప్రశంస పత్రాలతో బాలికలు

బెల్లంపల్లి: హైదరాబాద్ కేంద్రంగా ఆదివారం జరిగిన ఆదియోగా మహోత్సవంలో బెల్లంపల్లికి చెందిన చిన్నారి బాలికలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చి అబ్బుర పర్చారు. ఉత్తమంగా ప్రదర్శనలు ఇచ్చి నంది అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో ఆదియోగా మహోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో బెల్లంపల్లి నటరాజ డ్యాన్స్ అకాడమీకి చెందిన బాలికలు పాల్గొని శాస్త్రీయ నృత్యప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శనలో చిన్నారులు చూపిన ప్రతిభను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. నంది అవార్డులు, ప్రశంసాపత్రాలు అందించారు. అవార్డులు అందుకున్న బాలికల్లో శ్రీవిద్య, సాహితి, అపూర్వ, శ్రీనిక, అమన్వి, బ్రింద, లక్ష్మి, వర్షిణి, సాయి మనుజ్ఞ, హన్విక, రేష్మ, సహస్ర, షణ్ముఖప్రియ ఉన్నారు. అవార్డులు అందుకున్న చిన్నారులను నాట్యాచారిణి అర్చన జయప్రకాశ్, తల్లిదండ్రులు అభినందించారు.

ఎంకే యూత్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా సతీశ్



గుర్రపు సతీశ్

శ్రీరాంపూర్: మున్నూరు కాపు యూత్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నస్పూర్‌కు చెందిన గుర్రపు సతీశ్‌ను నియమించారు. ఈమేరకు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో ఎంపీ రవిచంద్ర కార్యాలయంలో సతీశ్‌కు నియామక పత్రం అందించారు. యూత్‌ను మరింత సంఘటితం చేసి కుల అభివృద్ధికి కృషి చేస్తానని సతీశ్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి కీలకమైన ఈ బాధ్యతలు అప్పగించినందుకు ఎంపీ రవిచంద్ర, మంత్రి గంగుల కమలాకర్, కుల సంఘం అధ్యక్షుడు దేవయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు ఆకుల లలిత, నాయకులు కొత్త లక్ష్మణ్, బోరిగం రాజారాం, నల్ల శంకర్‌కు సతీశ్ కృతజ్ఞతలు తెలిపారు.

300వ మహా గీత జ్ఞానయజ్ఞం



గీత పారాయణంలో పాల్గొన్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక భగవద్గీత అధ్యయన మండలి ఆధ్వర్యంలో ఆదివారం 300వ గీత జ్ఞానయజ్ఞం నిర్వహించారు. గీత సత్సంగ్-గీత పారాయణం, లలితా పారాయణం పఠించారు. అంతకుముందు శ్రీకృష్ణుని విగ్రహంతో పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భగవద్గీత అధ్యయన మండలి వ్యవస్థాపక సభ్యుడు, గౌర అధ్యక్షుడు డాక్టర్ కృష్ణారెడ్డి, అధ్యక్షుడు రంగ ఆగయ్య, కార్యదర్శి హరీశ్, కోశాధికారి చంద్రశేఖర్, సభ్యులు శ్రీనివాసరెడ్డి, రాజేశం, డాక్టర్ సుగుణాకర్‌రెడ్డి, విశ్వేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

మరాఠా కునభిలను ఓబీసీలో చేర్చుతాం

- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్

ఆదిలాబాద్: మరాఠా కునభి, మరాఠా నాన్ బ్రాహ్మిణ్‌లను ఓబీసీ జాబితాలో చేర్చడానికి సుముఖంగా ఉన్నట్లు కేంద్ర మాజీ మంత్రి, జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం అహీర్ పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి చంద్రపూర్ వెళ్తూ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ నివాసంలో ఆదివారం ఆయన విడిది చేశారు. ఈ సందర్భంగా మరాఠా కునభి సంఘం నాయకులు తమను ఓబీసీ జాబితాలో చేర్చాలని గంగారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారు.

- ఇటీవల మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గంజాయి పట్టుకున్నారు. ఈ ఘటన జిల్లాలో సంచలనంగా మారింది.
- ఈ నెల 5న మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో టోల్‌ప్లాజా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి 1.25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిలో ఒకరు మైనర్ కావడం గమనార్హం.
- ఈనెల 22న జన్నారం మండలం పోన్కల్ గ్రామ సమీపంలో గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్ ఫోర్స్‌పోలీసులు గుర్తించారు. అదే గ్రామానికి చెందిన నేతుల నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. లాతోర్ గ్రామానికి చెందిన పటేల్ పారిపోయాడు. వీరి నుంచి 2.18 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడిన ఇద్దరూ విద్యార్థులే.
- గతంలో జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీకి చెందిన కొందరు యువకులు గంజాయి తాగుతుండగా ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో మాజీ కౌన్సిలర్ కుమారుడు ఉన్నాడు.

గుట్టుగా గంజాయి దందా!



జన్నారం మండలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పటుబడ్డ విద్యార్థి, స్వాధీనం చేసుకున్న గంజాయి



గంజాయి ప్యాకెట్లు



గంజాయి తాగుతున్న యువకులు(ఫైల్)

- మంచిర్యాలే అడ్డా
- ఇతర జిల్లాల నుంచి దిగుమతి
- యువతే లక్ష్యంగా విక్రయాలు
- పీడీ యాక్ట్ నమోదు చేసినా మారని స్మగ్లర్లు

మంచిర్యాలక్రైం: మత్తు.. ఇది కొందరికి బలహీనతగా మారితే.. మరికొందరు దీనిని ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. చీకట్లో సాగే ఈ వ్యాపారంతో స్మగ్లర్లు లక్షలు సంపాదిస్తూ ఏంజాయ్ చేస్తుండగా, మత్తు బానిసలు తమ జీవితాన్ని సర్వ నాశనం చేసుకుంటున్నారు. మంచిర్యాల కేంద్రంగా గంజాయి దందా జోరుగా సాగుతోంది. అంతా గాఢ నిద్రలో ఉన్నప్పుడు గంజాయి స్మగ్లర్లు, గంజాయి తాగేవారు 'గ..మ్మత్తు' గా వారి కార్యకలాపాలను ప్రారంభించి.. తెల్లవారేలోగా పని పూర్తి చేసుకుంటున్నారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు మాత్రం నియంత్రణలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమంగా దిగుమతి..

గంజాయిని మహబూబాబాద్ జిల్లాలోని కుర్వి, మహారాష్ట్ర, కొమురం భీమ్ జిల్లాల నుంచి కొందరు మంచిర్యాలకు అక్రమంగా తరలిస్తున్నారు. రైలు, బస్సు, ప్రైవేటు వాహనాల్లో గుట్టుగా జిల్లా కేంద్రానికి చేరుస్తున్నారు. స్థానిక వ్యాపారులకు విక్రయించి వెళ్లిపోతున్నారు.

యువతకు విక్రయం..

యువతే లక్ష్యంగా స్థానిక వ్యాపారులు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలోకి మార్చి విక్రయిస్తున్నారు. యువత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చిన్నచిన్న దుకాణాలు, పాన్ డబ్బాల్లో తెలిసిన వారికి మాత్రమే గంజాయి విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మరోవైపు జిల్లాలోని వ్యాపారులకు రాజకీయ నేతల అండ కూడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో దందాను అదుపు చేయాల్సిన పోలీస్, ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అడపా దడపా పట్టుకున్నా.. రాజకీయ ఒత్తిడితో పట్టుబడిన వారిపై చిన్న కేసులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు.

పీడీ యాక్ట్ పెట్టినా..

జిల్లాకు చెందిన ఆగోటి రాము, అల్మేకర్ శ్యామ్ గంజాయి స్మగ్లింగ్ చేస్తూ పలుమార్లు పట్టుబడ్డారు. దీంతో వీరిపై పీడీ యాక్ట్ నమోద చేశారు. జైలు శిక్ష అనంతరం బయటకు వచ్చిన వారు పద్ధతి మార్చుకోకుండా గంజాయి దందా సాగిస్తున్నారు. పలుమార్లు పోలీసులకు పట్టుబడ్డారు.

మైనర్లు, విద్యార్థులే అధికం..

గంజాయి, డ్రగ్స్ వినియోగించేవారిలో మైనర్లు, విద్యార్థులే అధికంగా ఉంటున్నారు. యువతే లక్ష్యంగా వ్యాపారులు కూడా ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యా సంస్థల వద్ద అమ్మకాలు ఎక్కువగా సాగిస్తున్నారు. జిల్లాలో పట్టుబడుతున్నవారిలో యువత, విద్యార్థులే ఉండడం ఇందుకు నిదర్శనం.

మత్తులో యువత...

జిల్లాలోని యువత గంజాయికి బానిసై జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీపార్క్, రాళ్లపేట, రైల్వే బీక్యాబిన్, బైపాస్ రోడ్, కాలేజీ రోడ్, గర్మిళ్ల రైల్వే ట్రాక్, హైటెక్ సిటీ ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో యువత గంజాయి తాగుతూ తూలుతున్నారు. జిల్లా కేంద్రంలోని కొన్ని పాన్‌షాపుల్లో సైతం గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. 100 గ్రాముల ప్యాకెట్‌కు రూ.500 విక్రయిస్తున్నారు. ఆ గంజాయిని కొనుగోలు చేసినవారు సిగరెట్‌లోని పొగాకును తీసేసి అందులో గంజాయి నింపి తాగుతున్నారు. కొందరు కూల్‌డ్రింక్స్, స్వీట్స్‌లో కలుపుకుని తాగుతున్నారు. మరికొందరు కూల్ డ్రింక్స్ బాటిల్‌కు సొంగ తయారు చేసుకుని తాగుతున్నారు.

మూడేళ్లలో జిల్లాలో నమోదైన గంజాయి కేసులు...

సంవత్సరం	కేసులు	అరెస్ట్ అయినవారు	స్వాధీనం చేసుకున్న గంజాయి(కిలోల్లో)
2020	05	11	6.69
2021	17	50	12.72
2022	07	18	7.82
2023, ఫిబ్రవరి(వరకు)	02	04	4.03

సోలార్ రూఫ్‌టాప్‌కు సబ్సిడీ రుణం

- స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంజూరు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ఈనెలాఖరు వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం



ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్‌పవర్ యూనిట్(ఫైల్)

పాతమంచిర్యాల: స్వయం సహాయక సంఘాల మహిళలకు గ్రామీణాభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ స్వయం ఉపాధి కోసం రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నాయి. తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చి మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నాయి. తాజాగా విద్యుత్ ఖర్చులు తగ్గించుకునేందుకు, సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది.

200 చదరపు గజాల దాబా ఇళ్లు ఉన్నవారికి..

160 నుంచి 200 చదరపు అడుగుల డాబా ఇళ్లు ఉన్న వారికి సోలార్ పవర్ ప్యానెల్ ఏర్పాటు చేసుకునే అవకాశముంది. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకున్న మహిళా సంఘాల సభ్యులు సొంతంగా సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని గృహ అవసరాలకు వినియోగించుకోవచ్చు. వారు వినియోగించగా మిగిలిన విద్యుత్‌ను పవర్ గ్రిడ్‌కు విక్రయించే వెసులుబాటును అధికారులు కల్పించనున్నారు. సోలార్ ప్యానెల్ నెలకొల్పుకునేందుకు కావాల్సిన అనుమతులు రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీఎస్ రెడ్కో)మంజూరు చేస్తుంది. సోలార్ ప్యానెల్ యూనిట్ ఏర్పాటు చేస్తుంది.

రూ.2 లక్షల వరకు రుణం..

సోలార్ యూనిట్ స్థాపన కోసం డీఆర్డీఏ, స్త్రీనిధి నుంచి మహిళలకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు రుణం పొందవచ్చు. సోలార్ ప్లాంట్ కోసం తీసుకున్న రుణాన్ని సబ్సిడీ పోను మిగతా మొత్తాన్ని 11 శాతం వడ్డీతో 60 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. సోలార్‌ప్యానెల్‌లో రోజుకు 2 నుంచి 12 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. 2 కిలో వాట్ సామర్థ్యం గల యూనిట్ ధర రూ.1,42,200 ఉండగా 3 కిలో వాట్‌సామర్థ్యం గల యూనిట్ ధర రూ.1,92,360 లక్షలు ఉంది. 2 కిలో వాట్ సామర్థ్యం ఉన్న యూనిట్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం రుణంపై రూ.39,200 సబ్సిడీ ఇస్తుంది. 3 కిలోవాట్ యూనిట్‌కు తీసుకున్న రుణంపై రూ.57,360 సబ్సిడీ ఉంటుంది. మిగతా సొమ్మును లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది. జిల్లాలో 9 మండలాలకు 315 సోలార్ యూనిట్లు మంజూరు కాగా, మండలానికి 35 యూనిట్లు ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈమేరకు మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకునే మహిళలు ఈనెల 28 వరకు దరఖాస్తు చేసుకుంటేనే సబ్సిడీ వర్తిస్తుంది. ఆ తర్వాత దరఖాస్తులకు సబ్సిడీ మొత్తం తగ్గుతుందని అధికారులు తెలిపారు.

మహిళా సంఘాల సభ్యులకు వరం

మహిళాసంఘాల సభ్యుల్లో నెలకు రూ.800 నుంచి రూ.1000 విద్యుత్ బిల్లులు చెల్లించే వారికి సబ్సిడీ సోలార్ రూఫ్‌టాప్ పథకం వరం లాంటిది. సోలార్‌ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది. ఎలాంటి ఖర్చు లేకుండా 25 ఏళ్ల సోలార్ విద్యుత్ వినియోగించుకోవచ్చు. ఈ అవకాశాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. – వెంకటరమణ, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్

బోధన నైపుణ్యంలో శిక్షణ

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని అండాలమ్మకాలనీలో నిరక్షరాస్య వయోజన అభ్యాసకులకు బోధించే 50 మంది వలంటీర్లకు బోధన నైపుణ్యంలో ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వయోజన విద్య అధికారి పురుషోత్తంనాయక్ మాట్లాడుతూ అక్షరం జీవన విధానం మార్చడంలో అత్యున్నత సాధనమని, అక్షరాస్యత సాధించినప్పుడే ప్రగతి సాధ్యమన్నారు. అంతకుముందు డీఆర్పీ పోకల వెంకటేశ్వర్లు వలంటీర్లకు బోధించే విధానంపై మెలకువలు నేర్పించారు. డీఆర్పీ రమేశ్ అక్షరాస్యతతో కలిగే ఉపయోగాలు, ఆటపాటల రూపంలో ఆసక్తికరంగా బోధించే పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో డీఆర్పీ అశోక్‌రావు, అంగన్‌వాడీ టీచర్ శోభ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పురుషోత్తం నాయక్

మున్సిపల్ కమిషనర్లతో 'సాక్షి' ఫోన్ ఇన్

రామకృష్ణాపూర్/బెల్లంపల్లి: జిల్లాలోని పట్టణాల్లో ప్రజలు మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడేందుకు 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. పట్టణాల్లో నెలకొన్న సమస్యలు, వీధి కుక్కలు, కోతుల బెడద, వీధి దీపాలు పని చేయకపోవడం, పారిశుధ్యం, తాగునీటి సరఫరాలో అంతరాయం తదితర సమస్యలపై ఆయా మున్సిపాల్టీల కమిషనర్ల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం కోరవచ్చు.

నేడు..
క్యాతనపల్లి మున్సిపాలిటీ కమిషనర్:
జి.వెంకటనారాయణ



సంప్రదించాల్సిన నంబరు:
91212 83460
సమయం : సోమవారం ఉదయం
11 గంటల నుంచి 12 గంటల వరకు

నేడు..
బెల్లంపల్లి మున్సిపాల్టీ ఇంచార్జి కమిషనర్
ఆకుల వెంకటేష్



సంప్రదించాల్సిన నంబరు :
97019 09596
సమయం : సోమవారం మధ్యాహ్నం
2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు

గడువులోపు గగనమే!

- జిల్లాలోని మున్సిపాలిటీల్లో నత్తనడకన పన్ను వసూళ్లు
- లక్ష్యం పూర్తికి మరో నెల రోజులే గడువు
- బకాయిలు రూ.కోట్లలో..
- కానరాని ప్రత్యేక చర్యలు



పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇంకా నెల రోజులే సమయం ఉంది. అయినా ఆస్తి పన్ను వసూలులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు 70 శాతానికిపైగా పన్ను వసూలు చేయాల్సి ఉండగా కేవలం 43.87 శాతం మాత్రమే వసూలయ్యాయి.

పన్నులే ప్రధాన ఆదాయం..

మున్సిపాలిటీలకు పన్నులే ప్రధాన ఆదాయ వనరు. వీటిని సకాలంలో వసూలు చేయక పోవడంతో ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు చెల్లించడం కూడా కష్టంగా మారుతోంది. జిల్లావ్యాప్తంగా ఏడు మున్సిపాలిటీల్లో నివాస, వాణిజ్య గృహాలు 94,535 ఉన్నాయి. పన్ను డిమాండ్ రూ.36.60 కోట్లు కాగా, ఇప్పటికి రూ.16.05 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. 43.87 శాతంగా మాత్రమే వసూలు చేశారు. మార్చి 31 వరకు పన్ను వందశాతం పన్ను వసూలు చేయాల్సి ఉంది. మిగిలిన నెలరోజుల్లో 57 శాతం వసూలు చేయడం కష్టమే. పన్ను వసూళ్ల పూర్తి కాకపోతే మున్సిపల్ కార్యాలయాల నిర్వహణ, కార్మికులకు అందించే వేతనాలు ఇవ్వడానికి ఇబ్బందులు తప్పవు.

లక్సెట్టిపేట ఫస్ట్..

ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో లక్సెట్టిపేటలో మాత్రమే 82.82 శాతం అత్యధికంగా వసూలు కాగా, క్యాతన్‌పల్లిలో 59.40 శాతం వసూలుతో రెండోస్థానంలో ఉంది. మంచిర్యాల మున్సిపాలిటీలో 48.89 శాతం పన్నులు వసూలయ్యాయి. చెన్నూరులో 39.05 శాతం, నస్పూర్‌లో 33.33 శాతం, బెల్లంపల్లిలో 31.89 శాతం వసూలు కాగా, అత్యల్పంగా మందమర్రి మున్సిపాలిటీలో 30.88 శాతం మాత్రమే వసూలయ్యాయి.

ప్రత్యేక దృష్టిసారిస్తేనే...

జిల్లాలోని మంచిర్యాల, లక్సెట్టిపేట్ మున్సిపాలిటీలకు మందమర్రి, బెల్లంపల్లి మున్సిపాలిటీలకు ఇన్‌చార్జి కమిషనర్లే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు పన్ను వసూలుకు సరిపడా సిబ్బంది లేరు. దీంతో పన్ను వసూళ్లు ఆశించిన మేరకు జరుగడం లేదు. పన్ను బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాల్సి ఉండగా, ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా పన్నుల వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఏటా జనవరి నుంచే పన్ను బకాయిల వసూళ్లకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేయడంతోపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేవారు. ఫిబ్రవరి వరకు 60 శాతానికి పైగా పన్నులు వసూలయ్యేవి. ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేదీ వచ్చినా, ఇంకా 43.87 శాతం మాత్రమే వసూలయ్యాయి. ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకుంటే తప్ప మార్చి 31లోపు వందశాతం వసూలు చేయడం సాధ్యం కాదని మున్సిపల్ సిబ్బందే పేర్కొంటున్నారు.

జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో ఈనెల 25 వరకు వసూలైన ఆస్తి పన్ను వివరాలు

మున్సిపాలిటీ	నివాస/వాణిజ్య గృహాలు	పన్ను డిమాండ్	పన్ను వసూలు	వసూలు శాతం
బెల్లంపల్లి	13,343	4.93 కోట్లు	1.57 కోట్లు	31.89 శాతం
మందమర్రి	15.019	4.85 కోట్లు	1.49 కోట్లు	30.88 శాతం
క్యాతన్‌పల్లి	9,946	2.59 కోట్లు	1.53 కోట్లు	59.40 శాతం
మంచిర్యాల	25,714	16.12 కోట్లు	7.88 కోట్లు	48.89 శాతం
నస్పూరు	17.706	4.58 కోట్లు	1.52 కోట్లు	33.33 శాతం
చెన్నూరు	7,122	2.77 కోట్లు	78.41 లక్షలు	39.05 శాతం
లక్సెట్టిపేట్	5,685	1.51 కోట్లు	1.26 కోట్లు	82.82 శాతం
మొత్తం	94,535	36.60 కోట్లు	16.05 కోట్లు	43.87 శాతం

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

మంచిర్యాలక్రైం: ఈ నెల 25, 26 తేదీల్లో హనుమకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈగం మారయ్య తెలిపారు. లక్సెట్టిపేట కేజీబీవీకి చెందిన కె.నందిని జావలిన్ త్రోలో బంగారు పతకం, సీతారంపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన దేవ ఐశ్వర్య 5 కేఎం రేస్ వాక్‌లో కాంస్య పతకం, కె.హంసిని డిస్కస్‌త్రోలో కాంస్య పతకం సాధించారని తెలిపారు. బాలుర విభాగంలో పి.దివాకర్ జావలిన్ త్రోలో కాంస్య పతకం గెలుచుకున్నాడు. విజేతలకు అథ్లెటిక్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి పి.వెంకటేశ్వర్‌రెడ్డి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. క్రీడాకారులను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాంమూర్తి అభినందించారు.

అసైన్డ్ భూమిలో సీసీ రోడ్డు

- అవసరం లేనిచోట రూ.4 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మాణం



గుడిపేటలో నిర్మించిన సీసీ రోడ్డు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలో కొంత మంది ఇంటి యజమానులకు మాత్రమే ఉపయోగపడేలా నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అసైన్డ్ భూమిలో ఇప్పటికే ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు ఏకంగా ఈజీఎస్ నిధులు రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. దొడ్డిదారిన వార్డు సభ్యులు తీర్మానం సృష్టించారు. దీని ఆధారంగా కేవలం ఆరు కుటుంబాలు మాత్రమే ఉండే కాలనీకి రూ.4 లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ఈజీఎస్ కింద నిర్మించే సీసీ రోడ్లు 10 ఫీట్లు లేదా 12 ఫీట్లు మాత్రమే ఉండాలి. ఆరు ఇళ్ల కోసం వేసిన సీసీ రోడ్డు మాత్రం 20 ఫీట్ల వెడల్పు ఉంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడమే కాకుండా ఆ ఖర్చు మొత్తాన్ని పంచాయతీ భరించాలని ఆ కాలనీలోని ఓ ప్రజాప్రతినిధితోపాటు, గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ అయిన మరో ప్రజాప్రతినిధి సర్పంచ్‌పై ఒత్తిడి తెచ్చి సీసీ రోడ్డు వేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అవసరం లేనిచోట రోడ్డు నిర్మించడంపై విమర్శలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రోడ్డుకు ఉపాధి నిధులు కేటాయిస్తే తన పదవికే ముప్పు వస్తుందని సర్పంచ్ పేర్కొన్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్, స్థానిక నాయకుడు పంచాయతీ నిధులు మంజూరు చేసి తమపై ఆర్థికంగా భారం పడకుండా చూడాలని ఎమ్మెల్యే స్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ సీసీ రోడ్డు నిర్మాణంపై పంచాయతీరాజ్ ఏఈ కామేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా సీసీ రోడ్డు వెడల్పు ఎంత ఉన్నా నిబంధనలకు మేరకు ఎంబీ తయారు చేసి బిల్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రూ.4 లక్షల మేరకు మాత్రమే బిల్లు మంజూరవుతుందని తెలిపారు. ఏది ఏమైనా గుడిపేటలో అవసరం లేని చోట సీసీ రోడ్డు నిర్మాణంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

చెట్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు


చెట్లపొదల్లో చిక్కుకున్న కారు...

జైపూర్: మండల కేంద్ర సమీపంలోని వెలిశాల మల్లన్న గుడి ప్రాంతంలో కారు అదుపుతప్పి చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. హైదరాబాద్‌కు చెందిన సురాజ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి చెన్నూర్ పోచమ్మ దేవుడి వద్దకు మొక్కులు తీర్చుకోవడానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వెలిశాల మల్లన్న గుడి ప్రాంతంలో కోతుల గుంపు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వాటిని తప్పించే ప్రయత్నంతో కారు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని వారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చోరీకి విఫలయత్నం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఆదివారం మధ్యాహ్నం చోరీకి విఫలయత్నానికి చేసింద్రు... స్థానికుల వివరాల ప్రకారం... ఈఎస్‌ఐ సూపరింటెండెంట్ పాత భవనం ఎదుట శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్ల నుంచి ఓ యువకుడు ఇనుప జాలీలు, స్క్రాప్‌గా మారిన ఇనుప పరికరాలను ఓ ఆటోలో లోడు చేస్తుండగా స్థానికులు అక్కడికి చేరుకోవడంతో సదరు యువకుడు పారిపోయాడు. సదరు వ్యక్తి గతంలో కూడా పలు మార్లు స్క్రాప్ దొంగతనాలకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంలో పట్టణ ఎస్సై బి.అంజయ్యను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపాడు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి దగ్ధం


కాలిపోయిన సామగ్రి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్ నగర్ మార్కెట్ ట్రాక్టర్ షెడ్ ఏరియాలోని విపుల్ షీల్ అనే వ్యక్తికి చెందిన ఇంట్లో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని 10 గ్రాముల బంగారం, రూ.70వేల నగదుతో పాటు గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు పూర్తిగా కాలిపోయాయి. విపుల్ షీల్ దంపతులు బాబాసాగర్ గ్రామానికి పని నిమిత్తం వెళ్లారు. ఇంట్లో ఎవరులేని సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పేందుకు యత్నించినప్పటికీ ఫలితం కానరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఈజ్‌గాం ఏఎస్సై హీరామన్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత


పట్టుబడ్డ కలపతో అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: అక్రమంగా కలప తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. రేంజ్ అధికారి అప్పలకొండ వివరాల ప్రకారం... సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. విషయం తెలుసుకున్న అక్రమదారులు ఆ వాహనాన్ని మాణిక్‌గూడ వద్ద చెట్లలో పార్కింగ్ చేసి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం సిబ్బంది వాహనాన్ని గుర్తించి అందులోని 31 కలప దుంగలు స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఇందులో ఎఫ్‌బీవో రవి, దీవెన్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి మగువకు 'అందాల' కిరీటం


తల్లిదండ్రులతో చార్మన్ విట్నీ విన్సెంట్



- ఆలిండియా స్థాయి పోటీల్లో రన్నర్‌గా నిలిచిన చార్మన్ విట్నీ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో పుట్టి పెరిగిన ఓ మహిళ అందాల పోటీల్లో రాణించి అబ్బురపరిచింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే మొదటి ప్రయత్నంలోనే ఆలిండియా స్థాయి అందాల పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుచుకుని సంకల్ప బలాన్ని నిరూపించుకుంది. ఆమెనే బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రడగంబాల బస్తీకి చెందిన చార్మన్ విట్నీ విన్సెంట్. ఈ నెల 12న హైదరాబాద్ తాజ్ బంజారా వేదికగా గ్లోబల్ బ్యూటీ ట్రెజర్ ఆధ్వర్యంలో అందాల పోటీలను నిర్వహించారు. ఇండియన్ ఎయిర్ లైన్స్‌లో పని చేస్తున్న విన్సెంట్ ఆ పోటీలో పాల్గొనడానికి సిద్ధపడింది. తల్లిదండ్రులైన జిలియన్, లయనల్ విన్సెంట్‌ల ప్రోత్సహంతో అందాల పోటీల్లో పాల్గొంది. తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ తొలి ప్రయత్నంలోనే ద్వితీయ బహుమతి సాధించి సత్తా చాటింది. అత్యంత సహజ సిద్ధంగా అందాల పోటీల్లో ఆమె రాణించిన తీరు అందరి దృష్టిని ఆకర్శించింది.

30 ఏళ్ల వయస్సు ..11 ఏళ్ల కూతురు

చార్మన్ విట్నీ విన్సెంట్ బెల్లంపల్లిలోని మదర్స్ కాన్వెంట్ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుంది. తండ్రి లయనల్ విన్సెంట్ బెల్లంపల్లి ఏరియా గోలేటి వర్క్‌షాప్‌లో కార్మికుడిగా పనిచేశాడు. తల్లి జిలియన్ బెల్లంపల్లికి బ్యూటీ పార్లర్‌ను పరిచయం చేశారు. రడగంబాలబస్తీలో బ్యూటీ పార్లర్‌ను కొంతకాలం పాటు నిర్వహించారు. లయనల్ విన్సెంట్ ఐదేళ్ల క్రితం సింగరేణిలో ఉద్యోగ విరమణ చేయడంతో అతడి కుటుంబాన్నీ హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లో బీకాం (కంప్యూటర్స్)లో విట్నీ విన్సెంట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఉన్నత విద్య పూర్తికాగానే ఎయిర్‌లైన్స్‌లో లీడ్ ఫ్లైట్ అటెండెంట్‌గా ఉద్యోగాన్ని సాధించింది. ప్రస్తుతం ఆమె వయస్సు 30. వివాహితైన ఆమెకు 11ఏళ్ల కూతురు ఉంది. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే ఆలిండియా స్థాయిలో జరిగిన అందాల పోటీల్లో పాల్గొని అలవోకగా నెగ్గి అదరహో అనిపించింది.

పోటీల్లో అందమొక్కటే సరిపోదు

అందాల పోటీలో అందంగా ఉంటే సరిపోదు. నడవడిక, నడక, ఆహార్యం వ్యక్తిలోని తదితర అంశాలను న్యాయ నిర్ణేతలు పరిశీలిస్తారు. పోటీలు మూడు రోజుల పాటు జరిగాయి. ఆ పోటీల్లో వివిధ అంశాల వారీగా పోటీదారులు కనబర్చిన ప్రతిభా పాటవాలను క్షుణ్ణంగా పరిశీలించి మార్కులు వేస్తారు. భోజనం చేస్తున్న తీరు, కుర్చీలో కూర్చునే పద్ధతి, మాట తీరు రకరకాల అంశాలను నిశితంగా పరిశీలిస్తారు. ఆ అన్నింటిలోనూ నేను సాధారణంగానే పాల్గొన్నాను. ఇంట్లో రోజువారీగానే వ్యవహరించాను. ఎక్కడా ఎవరి వద్ద కోచింగ్ తీసుకోలేదు. సాధారణ మహిళగా పాల్గొని పోటీల్లో గెలవడం సంతోషాన్ని ఇచ్చింది. నా తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహమే నాకు కొండంత ధైర్యాన్ని ఇచ్చింది.
– చార్మన్ విట్నీ విన్సెంట్

చిన్నతనం నుంచే మక్కువ పెంచుకుని...

చార్మన్ విట్నీ విన్సెంట్ చిన్నతనం నుంచే అందంపై ఆసక్తిని పెంచుకుంది. తల్లి జిలియన్ నిర్వహించిన బ్యూటీ పార్లర్‌ను రోజువారీగా శ్రద్ధగా గమనించేది. మహిళలు అందాన్ని ఏ తీరుగా పెంచుకోవాలో, అందానికి అనుగుణంగా అలంకరించుకునే విధానాన్ని స్వతహాగా తెలుసుకుంది. అప్పటి నుంచే విన్సెంట్ అందాల పోటీల్లో ఒక్కసారైనా పాల్గొనాలనే పట్టుదలను, గెలవాలనే ఆత్మవిశ్వాసాన్ని ఏర్పర్చుకుని విజయం సాధించింది.

ప్రశాంతంగా గురుకుల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష


బెల్లంపల్లి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీవో స్వరూపారాణి

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్‌లో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశపరీక్ష రాయడానికి మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో కలిపి 88 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 6వ తరగతిలో 618 మంది విద్యార్థులకు 536 మంది పరీక్షకు హాజరు కాగా మరో 82 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్‌లో 590 మందికి 518 మంది విద్యార్థులు పరీక్ష రాయగా మరో 72మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు. ఉదయం 10గంటలకు ప్రవేశపరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. పరీక్షకు గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రాల్లో చల్లటి నీటి కుండలతో పాటు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి సీఓఈ గురుకుల బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా ఆయా పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, సంగన బట్ల శ్రీనివాస్, కె.రమా కళ్యాణిలు తగిన ఏర్పాట్లు చేశారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా కోటి చింతల మహేశ్వర్‌రావు, జ్యోతి వ్యవహరించారు.

పరీక్షా కేంద్రాల వారీగా...

బెల్లంపల్లి సీఓఈ బాలుర గురకుల కళాశాలల్లో 6వ తరగతిలో 201 మంది విద్యార్థులకు 172మంది విద్యార్థులు పరీక్ష రాయగా 29మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం 247మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 227మంది వచ్చారు. 20మంది పరీక్షకు దూరంగా ఉన్నారు.

ఆదిలాబాద్ గురుకుల బాలికల సీఓఈ పరీక్ష కేంద్రంలో...

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సంక్షేమ బాలికల గురుకుల సీఓఈలో 6వ తరగతిలో 200 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా 170 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మరో 30మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం 199 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 165మంది విద్యార్థులు హాజరు కాగా 34మంది పరీక్షకు హాజరు కాలేదు.

నిర్మల్ (జామ్) బాలికల గురుకుల కళాశాలలో ....

నిర్మల్ జిల్లా సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 6వ తరగతిలో 217 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 194 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారు. అదే తీరుగా ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం 144 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 126మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 18మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.

నేషనల్ రేస్‌లో శ్రీనివాస్ బోధన వీడియో



లింక్‌పై క్లిక్ చేస్తే ఇలా..


టీషర్టులపై మానవ శరీర భాగాలు ముద్రించి బోధన చేస్తున్న శ్రీనివాస్, పక్కనే విద్యార్థులు

- టీషర్టులపై శరీరాకృతులతో చదువు..
- టాప్–5లో నిలిచిన వీడియో
- నేషనల్‌కు వెళ్లాలంటే వీడియో పూర్తిగా చూడాల్సిందే
- అందరూ ప్రోత్సహించాలి : డీఈవో సూచన

మంచిర్యాలఅర్బన్: విద్యా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుంచి టాప్ 5 వీడియోలు ఎంపిక చేశారు. ఇందులో ఇన్నోవేటివ్ టీచింగ్ పెడగాగి విభాగంలో నెన్నెల మండలం నార్వాయిపేట్ ఎస్జీటీ ఉపాధ్యాయుడు జలంపల్లి శ్రీనివాస్ పంపిన వీడియో ఎంపికైంది. మానవ శరీర భాగాలు, అవయవాలు తెలిసేలా టీ–షర్టులపై బొమ్మలను ముద్రించి పాఠాలు బోధించిన (ఇంటర్నేషనల్ ఆర్గాన్స్ ఆఫ్ ది బాడీ ఆన్ షీర్ట్స్) వీడియోను ఎంపికచేశారు. టాప్–5 వీడియోల నుంచి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఇతరులు అత్యధికంగా చూసిన టాప్ –3 వీడియోలు నేషనల్‌కు వెళ్లనున్నాయి.

అందరం సహకరిద్దాం..

ఐదు నిమిషాల నిడివితో వినూత్న బోధనకు సంబంధించిన వీడియో రూపొందించారు. ఈ ఐదు నిమిషాలు స్కిప్ చేయకుండా మొత్తం చూస్తేనే చూసినట్లు అవుతుంది. జిల్లా నుంచి ఎంపికైనా శ్రీనివాస్ వీడియోను మార్చి 14లోగా అందరూ స్కిప్ చేయకుండా పూర్తిగా చూసి నేషనల్ లెవల్‌కు వెళ్లేలా సహకరిద్దామని డీఈవో వెంకటేశ్వర్లు కోరారు.

నేషనల్ లెవల్‌కు వెళ్లాలంటే..

వీడియో చూడాలంటే లింక్ క్లిక్ చేయగానే వెల్‌కంటూ దీక్ష అని వస్తుంది. స్టూడెంట్, టీచర్ ఏదైనా ఒకటి ఎంపిక చేయాలి. బోర్డ్ – తెలంగాణ, స్టేట్ ఏపీ, సీబీఎస్ఈ ఏదైనా ఒకటి ఎంపిక చేసుకోవాలి. ఇంగ్లిష్, తెలుగు మీడియం ఏదైనా, క్లాస్ 1 నుంచి 10వ తరగతి, ఇతరులు కూడా ఏదైనా ఎంపిక చేసుకుని సబ్మిట్ చేయాలి. గెస్ట్ డిలీట్ చేసి పేరు నమోదు చేయాలి. స్కిప్ చేయకుండా ఐదు నిమిషాలు పూర్తిగా వీడియో చూడొచ్చు. జిల్లా ఎంపిక చేసి కొనసాగించాలి. ఇలా ఐదు నిమిషాలు వీడియోను ఎక్కువ మంది చూస్తే టాప్–5లో నిలిచిన శ్రీనివాస్ వీడియో నేషనల్ స్థాయికి చేరనుంది.

వినూత్న బోధన.. విద్యార్థులకు సులువు

సైన్స్‌పై అవగాహన, విద్యార్థులకు ప్రతీ అంశాన్ని సులువుగా అర్థం చేసుకునేలా బోధనలో వినూత్న ఆలోచన చేశాడు. కళ్ల ఎదుట కదలాడేలా టీషర్టులపై మానవ శరీర ఆకృతులు ముద్రణ చేయించాడు. శరీర అంతర్భాగంలోని ప్రతీ అవయవం ఎలా ఉంటుందో తెలిసేలా ఈ బొమ్మలను చిత్రీకరించాడు. ఒక్కో తరగతికి ఒక్కో రకమైన టీషర్టు వేసుకుని సైన్స్ బోధన చేస్తూ ఆలోచింపజేస్తున్నాడు. ఏ అవయవం ఎలా పనిచేస్తుందో తెలిసేలా దృశ్య రూపకం ద్వారా బోధన చేస్తున్నాడు ఉపాధ్యాయుడు శ్రీనివాస్. అంతే కాకుండా ఇటీవల ఐదు నిమిషాల వీడియోను రాష్ట్రస్థాయికి పంపించగా టాప్–5లో నిలువడం సంతోషంగా ఉందని చెబుతున్నాడు. ఎక్కువ మంది వీడియోలు చూసి జాతీయ స్థాయికి సహకరించాలని కోరారు. వెన్నంటి ప్రోత్సహిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపాడు.

పులుల కదలికల పరిశీలన


అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

తాంసి: భీంపూర్ మండలం గుంజాల, గొల్లఘాట్ గ్రామాల శివారులో మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన నాలుగు పులులు రెండు రోజులుగా సంచరిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన జిల్లా అటవీశాఖ అధికారులు వాటి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం గుంజాల శివారులోని అటవీ ప్రాంతంలో ఎఫ్ఎస్వో అహ్మద్‌ఖాన్ బేస్‌క్యాంపు సిబ్బందితో కలిసి పులులు సంచరించిన ప్రదేశాలను పరిశీలించారు. వాటి పాదముద్రలు సేకరించి కొలతలు తీసుకున్నారు. శనివారం బేస్‌క్యాంపు సిబ్బందికి పులులు కనిపించిన నేపథ్యంలో అటవీశాఖ సిబ్బంది గుంపులుగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్వో మాట్లాడుతూ.. పులులు సంచరించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక బేస్‌క్యాంపు సిబ్బందితో పులుల సంరక్షణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గుంజాల అటవీ ప్రాంతం పులుల సంచారానికి అనువుగా ఉండడంతో అవి ఇక్కడే ఉన్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయని తెలిపారు. పులుల సంచారం నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పలు సూచనలు చేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారి గులాబ్‌సింగ్, ఎనిమల్ ట్రాకర్స్ కృష్ణ, హనుమంత్, సోనేరావు, సిబ్బంది ఉన్నారు.

ఆలయాలు ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్టు

- చిలకల భీమన్న ఆలయానికి నిప్పు
- సకాలంలో గమనించిన స్థానికులు
- వరుస ఘటనలతో స్థానికుల్లో ఆందోళన
- గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు


భీమన్న దేవాలయంలో మంటలు


నిందితుడు వెంకటేశ్

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని దుబ్బగూడలోని చిలకల భీమన్న ఆలయంలో ఆదివారం దుండగుడు నిప్పంటించాడు. మండలంలోని ఖర్జెల్లి శివాలయలంలో విగ్రహాల ధ్వంసం చేసిన మరుసటి రోజే చిలకల భీమన్న ఆలయానికి నిప్పుపెట్టడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం... చిలకల భీమన్న ఆలయం గ్రామం శివా రులో ఉంది. ఆదివారం ఉదయం అటువైపు వెళ్లిన ప లువురికి ఆలయంలోనుంచి పొగలు రావడాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు చేరుకుని మంటలు ఆర్పివేశారు. అక్కడికి చేరుకున్న ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. నిప్పంటించేందుకు సమీపంలోని పంట భూముల్లోని కర్రలను, ఆకులను సేకరించి ఆలయంలో పేర్చి నిప్పంటించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఆలయంలోని విగ్రహాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి.

నిందితుడి అరెస్టు

వరుస ఘటనల నేపథ్యంలో పోలీసులు విచారణ సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు. చింతల మానెపల్లి గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఉదయం 7గంటల సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన సలుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి వెంకటేష్ అలియాస్ జోష్ అనే వ్యక్తిని గుర్తించారు. మండల కేంద్రం నుంచి అనుకోడ గ్రామానికి వెళ్లే మార్గంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ నెల 25న మండలంలోని ఖర్జెల్లి శివాలయంలో, 24న బెజ్జూర్ మండలంలోని అందుగులగూడెం మల్లన్న గుట్ట ఆలయం ధ్వంసం చేసినట్లు నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి తమ్ముడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. తన తమ్ముడి చావుకు హిందూ దేవుళ్లే కారణమని భావించి ఆలయాల ధ్వంసానికి పాల్పడినట్లు విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు.

కోళ్లవ్యాన్ బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

చింతలమానెపల్లి: మండలంలోని ఆడెపెల్లి గ్రామం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నవీంద్రనగర్ గ్రామానికి చెందిన కోళ్ల వ్యాన్ కాగజ్‌నగర్ వైపు వెళ్తుండగా ఆడెపెల్లి గ్రామం సమీపంలో మలుపువద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సూరజ్‌తో పాటు వ్యాన్‌లో ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కాగా స్థానికులు 108లో కాగజ్‌నగర్‌కు తరలించారు. ఏఎస్సై యాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

యువతి అదృశ్యం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామంలోని గెర్రెగూడకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఈజ్‌గాం ఏఎస్సై హీరామన్ తెలిపారు. శనివారం యువతి తల్లిదండ్రులు ఉపాధి హామీ పనులకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి యువతి ఇంట్లో కనిపించలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

తనయుడి చితికి తల్లి నిప్పు

- అశ్రునయనాల మధ్య హర్ష అంత్యక్రియలు
- కడసారి చూపునకు నోచని తండ్రి


అంత్యక్రియలు జరుపుతున్న తల్లి రాధ

జన్నారం: జన్నారం మండలం చింతగూడకు చెందిన దాసరి హర్ష (22) నిజామాబాద్ జిల్లా మెడికల్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతూ శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శనివారం హర్ష మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా పెద్ద ఎత్తున స్థానికులు తరలివచ్చి నివాళులర్పించారు. అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించగా గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తండ్రి శ్రీనివాస్ మలేషియాకు నెలరోజుల క్రితమే తాపీమేస్త్రీ పనిపై వెళ్లాడు. చివరిచూపునకు సైతం నోచుకోలేదు. దీంతో తల్లి రాధ కొడుకు చితికి నిప్పుపెట్టింది. ఈ సంఘటన స్థానికులను కదిలించింది.

అన్నాచెల్లెళ్లకు అండగా యువత


ఆర్థిక సాయం అందిస్తున్న యువకులు

దహెగాం: మండలంలోని చౌక గ్రామానికి చెందిన అనాథలైన అన్నాచెల్లెళ్లకు దాతలు అండగా నిలుస్తున్నారు. 'అన్న పనిచేస్తేనే చెల్లెళ్ల కడుపు నిండేది' అనే శీర్షికతో ఈ నెల 15న సాక్షిలో ప్రచురితమైన కథనానికి దయార్థులు ముందుకు వస్తున్నారు. ఆదివారం మండలంలోని చిన్నగుడిపేట నవదుర్గ యూత్ సభ్యులు రూ.20వేల విలువ గల ఇటుకలు, 10 సిమెంట్ బస్తాలు, రూ.2వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పడమటింటి రామకృష్ణ, ధోని సాయికుమార్, రాజు, శ్రావన్, సాయి లింగరాజు, సాయి ఉన్నారు.

48ఏళ్ల తరువాత...


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1974–75లో పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో నిర్వహించారు. 48ఏళ్ల తరువాత ఒకేచోట కలుసుకున్నారు. నాలుగు దశాబ్దాల తరువాత కలుసుకున్న మిత్రులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. తొలుత లోకం విడిచిన గురువులు, మిత్రులకు సంతాపంగా మౌనం పాటించారు. చిన్ననాటి గురువులు పాండురంగరావు, కొమురయ్యలను శాలువలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల దంపతులను పరస్పరం శాలువలతో సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. ఇందులో పూర్వ విద్యార్థులు ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, గురుప్రసాద్, ఏకబిల్వం వినోద్‌కుమార్, వల్లపు సుగుణాకర్, పల్లెర్ల నాగభూషణం, చిలువేరు నాగేశ్వర్, చందూరి రమేశ్, సురేశ్‌లోథా పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



జన్నారం: జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 2004-05కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులంతా ఒక చోట చేరి బోధించిన గురువులను సన్మానించారు. అనంతరం ఒకరినొకరు అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు.



లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1990-91వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థినులు ఆదివారం స్థానిక పాఠశాలలో కలుసుకున్నారు. 30ఏళ్ల తరువాత ఒకేచోట చేరి ఆనందంగా గడిపారు. అప్పటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా నెమరేసుకున్నారు.